

కథా కౌముది

నోబెల్ బహుమతి డా.కలశపూడి శ్రీనివాసరావు

ఆ రోజు న్యూయార్క్ నగరం తెల్లని మంచు దుప్పటి కప్పుకోడానికి సిద్ధమవుతోంది.

బ్రాడ్‌వే మీద పసుపు రంగు టాక్సీలు ఒకదాని వెనుక ఒకటి దూసుకుపోతున్నాయి. ఆకాశం నుంచి రాలుతున్న మంచు రేకులు తొందరపడటం లేదు. నెమ్మదిగా... నిశ్శబ్దంగా... భూమిని ముద్దాడుతున్నాయి.

బట్లర్ లైబ్రరీ మెట్లపై మంచు పలుచగా పేరుకుపోతోంది. ఆల్మా మేటర్ విగ్రహం మీద తెల్లని మంచు టోపీలా కూర్చొంది.

చలి గాలిని పట్టించుకోకుండా విద్యార్థులు చేతుల్లో వేడి కాఫీ కప్పులతో, భుజాలపై బ్యాగులు వేసుకుని కొలంబియా యూనివర్సిటీ క్యాంపస్‌లో వేగంగా నడుస్తున్నారు. ప్రపంచమంతా పరుగెడుతున్నట్టు అనిపించింది.

ఆ రోజు మా అడుగుల్లో కూడా ఒక ప్రత్యేకమైన ఉత్సాహం ఉంది. నా వెంట హైస్కూల్ విద్యార్థులు ఉన్నారు.

వాళ్ల కళ్లలో ఆశ్చర్యం.

మనసులో వెయ్యి ప్రశ్నలు.

ఒకే ఒక్క కోరిక.

"నోబెల్ బహుమతి పొందిన ఒక శాస్త్రవేత్తను దగ్గరగా చూడాలి."

ఆ విద్యార్థులందరూ మా "పాత్ టు నోబెల్" ప్రాజెక్ట్‌లో పాల్గొన్నవారు. ఈ ప్రాజెక్ట్‌ను ప్రారంభించినప్పుడు చాలామంది ఒకే ప్రశ్న అడిగారు.

"మీరు పిల్లలందరినీ నోబెల్ బహుమతి గెలవమంటున్నారా?"

నేను నవ్వేవాడిని.

"లేదు. నోబెల్ బహుమతి గెలవడం ఒక గమ్యం కావచ్చు. కానీ ప్రశ్నించడం, నేర్చుకోవడం, విఫలమైనా మళ్లీ లేవడం—అదే నిజమైన ప్రయాణం. ఆ ప్రయాణం నేర్పడానికే ఈ ప్రాజెక్ట్. ఆ ఆలోచనే 'పాత్ టు నోబెల్.'"

ప్రతి విద్యార్థి తమకి నచ్చిన ఒక నోబెల్ విజేతను ఎంచుకుంటారు . ఆ విజేత జీవితాన్ని చదువుతారు.

బాల్యం...కుటుంబం... విద్య ... సందేహాలు... పరిశోధనలు... విజయం... అన్నీ అధ్యయనం చేస్తారు.

తర్వాత ఒక ప్రశ్న అడుగుతాడు.

"వారు హైస్కూల్‌లో ఎలా ఉండేవారు? నేను ఇప్పుడు ఎలా ఉన్నాను?"

ఆ అధ్యయనం ఆధారంగా ఒక వ్యాసం రాస్తాడు. ఆ వ్యాసాలన్నింటినీ పుస్తకంగా ప్రచురిస్తాం.

అది కేవలం పుస్తకం కాదు. ఒక విద్యార్థి తన భవిష్యత్తుతో చేసే మొదటి సంభాషణ.

ఆ రోజు మేము ఆ పుస్తకం మొదటి ప్రతిని ఒక అమెరికన్ నోబెల్ బహుమతి గ్రహీతకు అందించడానికి వచ్చాము. ఆయన కొలంబియా యూనివర్సిటీలో పరిశోధనలు కొనసాగిస్తున్నారు.

మా దారిలో మంచు కురుస్తోంది.

విద్యార్థులు మాత్రం చలిని మర్చిపోయారు.

"మనల్ని నిజంగానే కలుస్తారా?" మేధ మెల్లగా అడిగింది.

"కలుస్తారు," అన్నాను.

"మనం అడిగిన ప్రశ్నలకు సమాధానం చెబుతారా?"

"అడగడానికి భయపడకపోతే తప్పకుండా చెబుతారు."

"సార్, నాకు చాలా టెన్షన్‌గా ఉంది," వెనక నుంచి కెవిన్ అన్నాడు.

"ఎందుకు?" అడిగాను.

"నోబెల్ బహుమతి గెలిచిన మనిషితో మాట్లాడడం ఇదే మొదటిసారి."

నేను నవ్వాను.

మేము నాలుగో అంతస్తుకు వెళ్లాం.

పొడవాటి కారిడార్. రెండు వైపులా ఆఫీసులు. ప్రతి తలుపు మీద ఒక శాస్త్రవేత్త పేరు. ఒక పరిశోధనా విభాగం. ఒక ప్రయోగశాల. అది ఒక ప్రపంచం.

చివర్లో ఉన్న తలుపు దగ్గర మేము ఆగాము. తలుపు కొద్దిగా తెరిచి ఉంది.

లోపల నుంచి ఒక స్వరం వినిపించింది.

"లోపలికి రండి."

మేము నెమ్మదిగా లోపలికి అడుగుపెట్టాము.

గది గోడలన్నీ పుస్తకాలతో నిండిపోయాయి. ఒక మూల బ్లాక్‌బోర్డు. అందులో ఇంకా పూర్తికాని సమీకరణాలు. టేబుల్ మీద పరిశోధనా పత్రాల కట్టలు. పక్కనే సగం తాగిన కాఫీ కప్పు. కిటికీ పక్కన చిన్న పచ్చని మొక్క. గోడపై కొన్ని కుటుంబ ఫోటోలు. ఒక ఫ్రేమ్‌లో నోబెల్ పతకం .

సాధారణంగా కనిపించే ఒక గది. కానీ అందులో కూర్చున్నది అసాధారణమైన ఒక మనిషి.

ఆయన కుర్చీలోనుంచి లేచి మమ్మల్ని ఆహ్వానించారు.

తెల్లని జుట్టు. మృదువైన చిరునవ్వు. చూడగానే భయం పోయే ముఖం.

"స్వాగతం!" అన్నారు. "అయితే, వీళ్లేనా నా యువ రచయితలు?"

పిల్లలు ఒకరినొకరు చూసుకున్నారు.

మేధ పుస్తకాన్ని రెండు చేతులతో ఆయనకు అందించింది.

"సర్, మేము మీ గురించి, మీలాంటి నోబెల్ బహుమతి గ్రహీతల గురించి చదివాం. మీరు ఎలా గొప్పవాళ్లయ్యారో తెలుసుకోవాలనుకున్నాం."

ఆయన పుస్తకాన్ని మెల్లగా తీసుకున్నారు. మొదటి పేజీ తిప్పారు. కొన్ని క్షణాలు చూశారు. తర్వాత నవ్వారు.

"'గొప్పవాడు' అనే పదం చాలా ప్రమాదకరం," అన్నారు ఆయన.

అప్పటికే కెవిన్ ధైర్యం తెచ్చుకున్నాడు.

"సర్, అందరూ మిమ్మల్ని మేధావి అంటారు."

ఆయన వెంటనే నవ్వేశారు. కుర్చీలో కూర్చుంటూ అన్నారు.

"సరే, మీకు నచ్చిన ప్రశ్న అడగండి. కానీ నోబెల్ ఎలా గెలవాలి అని మాత్రం అడగకండి."

కొద్దిసేపు ఆగి మళ్లీ చిరునవ్వుతో అందరినీ చూస్తూ అన్నారు.

"అది నాకు తెలిసి ఉంటే, ఇప్పటికి రెండో నోబెల్ కోసం పనిచేస్తూ ఉండేవాడిని."

మళ్లీ నవ్వులు.

"నేను నిజంగానే అంత మేధావినైతే, మొదటి నోబెల్ తర్వాత ఇన్నేళ్లలో ఇంకో నోబెల్ కూడా వచ్చి ఉండేది. కాబట్టి మీరు అనుకుంటున్నంత మేధావిని నేను కాదు," అని గట్టిగా నవ్వారు.

ఈసారి గది మొత్తం ఒక్కసారిగా నవ్వులతో మార్మోగిపోయింది.

పిల్లల భయం మంచులా కరిగిపోయింది.

కొద్దిసేపటి క్రితం వరకు సంకోచంతో కూర్చున్న విద్యార్థులు ఇప్పుడు చాలా సహజంగా మాట్లాడుతున్నారు.

గదిలోని వాతావరణం పూర్తిగా మారిపోయింది.

ఇది ఇక ఒక ప్రసిద్ధ శాస్త్రవేత్త ఆఫీసు కాదు. ఒక మంచి ఉపాధ్యాయుడు తన విద్యార్థులతో మాట్లాడుతున్న తరగతి గది.

"ప్రొఫెసర్, తెలివి అంటే ఏమిటి?" మొదట మేధ చేతిని ఎత్తింది.

ఆయన చిరునవ్వు నవ్వారు.

"చాలామంది తెలివి అంటే చాలా సమాధానాలు తెలుసుకోవడం అనుకుంటారు."

ఒక్క క్షణం ఆగి చెప్పారు.

"కానీ నా అనుభవంలో, తెలివి అంటే ఒక మంచి ప్రశ్నను వదిలిపెట్టకుండా చాలాకాలం వెంటాడగలగడం."

మేధ వెంటనే తన నోట్‌బుక్‌లో రాసుకుంది.

ఈసారి కెవిన్ అడిగాడు.

"అయితే విజయం అంటే ఏమిటి?"

ఆయన కిటికీ బయట కురుస్తున్న మంచును చూస్తూ అన్నారు.

"విజయం అంటే గమ్యాన్ని చేరడం. ఆనందం అంటే ఆ దారిని ఆస్వాదించడం."

ఆ మాట పూర్తవగానే గదిలో మళ్లీ నిశ్శబ్దం.

"సర్, మీరు చిన్నప్పుడు ఎప్పుడూ తరగతిలో మొదటి విద్యార్థినా?" కార్లోస్ మెల్లగా అడిగాడు.

ఆయన నవ్వేశారు.

"కాదు. కొన్నిసార్లు తప్పిపోయాను. కానీ ఒక విషయం మాత్రం ఎప్పుడూ జరగలేదు. నాకు ఎప్పుడూ విసుగు రాలేదు."

"ప్రొఫెసర్, హైస్కూల్‌లో ఉన్న మేము ఇప్పుడే ఏం చేయాలి?" జాన్ అడిగాడు.

ఆయన పుస్తకాన్ని మూసి టేబుల్ మీద పెట్టారు.

"ముందుగా, ఇతరులతో పోల్చుకోవడం ఆపండి."

"ఎందుకు సర్?"

"ఎందుకంటే మీ మొదటి అధ్యాయాన్ని ఇంకొకరి ఇరవయ్యో అధ్యాయంతో పోల్చడం అన్యాయం," అన్నారు ఆయన.

పిల్లలందరూ ఒకేసారి తలూపారు.

ఆయన మా "పాత్ టు నోబెల్" పుస్తకాన్ని చేతిలోకి తీసుకున్నారు. మొదటి పేజీని మరోసారి చూశారు.

"మీరు ఈ ప్రాజెక్టుకు చాలా మంచి పేరు పెట్టారు," అన్నారు.

"ధన్యవాదాలు సర్."

"కానీ..." ఆయన స్వరం కొంచెం నెమ్మదించింది.

"ఒక విషయం మాత్రం ఎప్పుడూ గుర్తుంచుకోండి."

"ఏమిటి సర్?"

"నోబెల్ కంటే దాని వైపు నడిపించే దారి చాలా గొప్పది. ఎందుకంటే, ఆ దిశలో చేసే ప్రయాణం మిమ్మల్ని మనిషిగా మార్చుతుంది."

మా సంభాషణ దాదాపు గంటసేపు సాగింది. కుతూహలం, నవ్వులు, ఆలోచింపజేసే ప్రశ్నలు, హృదయాన్ని తాకే సమాధానాలతో సమయం ఎలా గడిచిపోయిందో ఎవరికీ తెలియలేదు.

ఆ క్షణంలోనే పిల్లలు ఒక గొప్ప శాస్త్రవేత్తను కాదు, ఒక మంచి ఉపాధ్యాయుడిని కనుగొన్నారు.

ఆయన దగ్గర నుంచి సెలవు తీసుకునే ముందు, ఎమిలీ నెమ్మదిగా ఒక ప్రశ్న అడిగింది.

"ప్రొఫెసర్, ఒక వ్యక్తి తన పనికీ, తన కుటుంబానికీ సమతుల్యం ఎలా సాధించాలి?"

గదిలో ఒక్కసారిగా నిశ్శబ్దం.

బయట మంచు మాత్రం అలాగే కురుస్తూనే ఉంది.

ఆయన కుర్చీలోనుంచి నెమ్మదిగా లేచి, అద్దాల కిటికీ దగ్గరకు వెళ్లి బయటకు చూస్తూ నిలబడ్డారు. కొన్ని క్షణాల తర్వాత ఆయన మెల్లగా అన్నారు.

"నువ్వు అడిగిన ప్రశ్నకు నేను పుస్తకాల్లో దొరికే సమాధానం చెప్పగలను."

మళ్లీ ఆగారు.

"కానీ నిజం చెప్పాలంటే, నా జీవితమే ఆ ప్రశ్నకు సరైన సమాధానం చెప్పలేకపోయింది."

ఎమిలీ కళ్లలో ఆశ్చర్యం.

మేమంతా ఒకరినొకరు చూసుకున్నాం.

"ఇప్పటివరకు మీతో మాట్లాడింది ఒక శాస్త్రవేత్త. ఇప్పుడు మాట్లాడబోతున్నది ఒక కొడుకు. నా తండ్రి... నా తండ్రి చివరి మూడు సంవత్సరాలు ఒక నర్సింగ్ హోంలో గడిపారు."

ఆయన కొద్దిసేపు ఆగారు.

"ఆయన మాట్లాడలేకపోయేవారు. ఆయన గొంతు పనిచేయడం మానేసింది. కానీ ఆయన మనసు మాత్రం పూర్తిగా మేలుగానే ఉంది."

ఆ మాట చెప్పేటప్పుడు ఆయన తన హృదయంపై చేయి పెట్టుకున్నారు. ఆయన స్వరం కొద్దిగా బరువైంది.

"ప్రతి ఆదివారం నేను ఆయనను చూడటానికి వెళ్లేవాడిని. కొలంబియా నుంచి నర్సింగ్ హోం వరకు కారు ప్రయాణం ఇరవై మూడు నిమిషాలు."

"నేను ప్రతిసారి ల్యాప్‌టాప్ కూడా తీసుకెళ్లేవాడిని. ఎందుకంటే పూర్తి కాని పని ఎప్పుడూ ఉండేది."

"ఒక పరిశోధనా పత్రం. ఒక సమావేశం. ఒక ఉపన్యాసం. ఒక విద్యార్థి థీసిస్. ఒక విమాన ప్రయాణం. ఎప్పుడూ ఏదో ఒకటి." కొద్దిసేపు ఆగి ఆయన అన్నారు.

"అప్పుడు అవన్నీ చాలా ముఖ్యమైనవిగా అనిపించేవి. ఆయన గదిలోకి వెళ్లగానే నన్ను చూసి నవ్వేవారు. నేను, 'హాయ్ డాడ్, ఎలా ఉన్నారు?' అని అడిగేవాడిని. ఆయన నవ్వేవారు. నా చేతిని గట్టిగా పట్టుకునేవారు. తర్వాత మంచం పక్కన ఉన్న డ్రాయర్ వైపు చూపించేవారు. పక్కనే ఉన్న చిన్న కార్డ్‌బోర్డ్ పెట్టె వైపు కూడా చూపించేవారు. కానీ నేను ప్రతిసారీ తప్పుగా అర్థం చేసుకున్నాను. ఆయనకు కళ్లద్దాలు కావాలనుకున్నాను. లేదా టీవీ రిమోట్. లేదా నీళ్లు. లేదా దుప్పటి. ఆయన తల అడ్డంగా ఊపేవారు. అప్పుడు నేను నవ్వుతూ, 'డాడ్, ఏమీ ఆలోచించకండి. విశ్రాంతి తీసుకోండి. బై డాడ్!' అని చెప్పి ఆ గది నుంచి బయటకు వచ్చేసేవాడిని. నేను చేయవలసిన పనులు నన్ను తరుముతున్నట్టుండేది."

ఒకసారి ఆగి మళ్ళీ మొదలు పెట్టారు.

"నా జీవితంలో నేను ఎక్కువగా ఉపయోగించిన మాట అదే. కానీ ప్రతిసారీ వచ్చే ఆదివారం ఎక్కువసేపు ఉంటానని అనుకునేవాడిని."

ఆ మాట చెప్పిన తర్వాత ఆయన చాలా సేపు మాట్లాడలేదు. చివరకు మా వైపు తిరిగి మెల్లగా అన్నారు.

"ఆ 'వచ్చే ఆదివారం' మన జీవితంలో అత్యంత ప్రమాదకరమైన వాగ్దానం."

గదిలో ఎవరూ కదల్లేదు.

"నేను ఆయన గదిలో కూర్చుని ఉండేవాడిని. కానీ నా మనసు అప్పటికే ల్యాబ్‌లో ఉండేది."

కొద్దిసేపు నిశ్శబ్దం.

ఎమిలీ తల వంచుకుంది.

మేధ తన పెన్ను మూసేసింది.

ఎవరూ ఒక్క మాట కూడా రాయడం లేదు.

"ఒక మంగళవారం ఉదయం నర్సింగ్ హోం నుంచి ఫోన్ వచ్చింది."

ఆయన స్వరం మరింత నెమ్మదించింది. 'మీ నాన్నగారు నిద్రలోనే ప్రశాంతంగా మరణించారు' అన్నారు."

ఆయన కళ్లలో మళ్ళీ ఆ రోజు ప్రత్యక్షమైంది కాబోలు.

"గదిలోకి వెళ్లాను. మంచం సర్దేశారు. కిటికీ బయట ఆ మేపుల్ చెట్టుకు ఒక్క ఆకు కూడా లేదు."

చిన్న విరామం తర్వాత ఆయన కొనసాగించారు.

"ఒక నర్స్ నాకు చిన్న కార్డ్‌బోర్డ్ పెట్టె ఇచ్చింది. 'ఇవి మీ నాన్నగారి వస్తువులు' అంది. ఆ పెట్టెను ఇంటికి తీసుకొచ్చాను. మెల్లగా తెరిచాను."

గదిలో ఎవరూ ఊపిరి కూడా గట్టిగా తీసుకోవడం లేదు.

"అందులో ఆయన కళ్లద్దాలు ఉన్నాయి. ఒక పాత చేతి గడియారం. ఆయనకు ఇష్టమైన యాంకీస్ టోపీ. కొన్ని కుటుంబ ఫోటోలు. ఒక మందమైన కాగితాల కట్ట."

ఆయన కళ్లను మూసుకున్నారు.

"ప్రతి కాగితం మీద ఒక తేదీ, ఒక విషయం రాసి ఉన్నాయి," అన్నారు.

ఆయన నెమ్మదిగా మొదటి కాగితం చదివారు.

"బాబు , ఈరోజు అలమార సర్దుతుంటే నువ్వు చిన్నప్పుడు ఆడిన బేస్‌బాల్ గ్లోవ్ దొరికింది. బంతిని పట్టుకోవడంలో నువ్వు అంత గొప్పవాడివి కాదు. కానీ ప్రయత్నించడం మాత్రం ఎప్పుడూ ఆపలేదు. జీవితంలో కూడా అలాగే ఉండు."

ఆయన చిరునవ్వు నవ్వారు. ఆ నవ్వు వెంటనే కన్నీటిలో కరిగిపోయింది.

రెండో కాగితం.

"ఈరోజు నువ్వు చాలా అలసిపోయినట్టు కనిపించావు. ఒక రాత్రి బాగా నిద్రపో. ప్రపంచం ఒక్క రాత్రి ఆగిపోదు."

మూడో కాగితం.

"అడిరాండాక్ పర్వతాల్లో మనం క్యాంపింగ్‌కు వెళ్లిన రోజు గుర్తుందా? చీకటికి నువ్వు భయపడితే, ఆకాశంలో నక్షత్రాలు దేవుడు వెలిగించిన రాత్రి దీపాలని చెప్పాను."

నాలుగో కాగితం.

"థాంక్స్‌గివింగ్ వస్తోంది. ఒకసారి నువ్వు టర్కీని కాల్చేసి ఓవెన్‌ను నిందించిన రోజు ఇంకా గుర్తొస్తే నవ్వొస్తుంది."

గదిలో చిన్న నవ్వు వినిపించింది.

ఆ నవ్వులో బాధ ఉంది.

ఆప్యాయత ఉంది.

జ్ఞాపకం ఉంది.

ఐదో కాగితం.

"ఈరోజు నిన్ను టెలివిజన్‌లో చూశాను. నువ్వు నోబెల్ బహుమతి తీసుకుంటున్నావు. నీ అమ్మ ఉంటే చాలా గర్వపడేది. నేనూ గర్వపడుతున్నాను. కానీ అది నీకు చెప్పలేకపోయాను."

ఆయన గొంతు ఆగిపోయింది.

చాలాసేపటి తర్వాత మళ్లీ మాట్లాడారు.

"ఇంకా ఉన్నాయి. చాలా ఉన్నాయి. దాదాపు నేను వెళ్లిన ప్రతి ఆదివారానికి ఒకటి. అప్పుడు ఒక్కసారిగా నాకు అన్నీ అర్థమయ్యాయి. ప్రతి ఆదివారం ఆయన ఆ పెట్టె వైపు చూపించేవారు. ఆ ఉత్తరాలు నాకు ఇవ్వాలని ప్రయత్నించేవారు. నేను మాత్రం, 'విశ్రాంతి తీసుకోండి డాడ్' అని చెప్పేవాడిని."

ఆయన రెండు చేతులు ముడుచుకున్నారు.

"ఆయనకు విశ్రాంతి అవసరం లేదు. ఆయనకు ఒక సంభాషణ కావాలి."

ఆ వాక్యం గదిలో మారుమ్రోగింది.

"ప్రపంచం నన్ను నోబెల్ బహుమతి విజేత అని పిలుస్తుంది."

"కానీ ఆ రాత్రి, నా ఇంట్లో ఆ ఉత్తరాల మధ్య కూర్చున్నప్పుడు, ఆయన నాతో మాట్లాడాలనుకున్న మాటలను నేను గ్రహించలేకపోయానని అర్థమైంది. ఆయనకు మాటలు రాకపోయినా, రాయగలరని తెలుసుకోలేక పోయాను. ఆయన చెప్పాలనుకున్నదాన్ని నేను గుర్తించలేకపోయాను. నేను ఓడిపోయిన మనిషిలా అనిపించింది."

చిన్న విరామం.

"అందుకే ఎవరైనా నన్ను చాలా తెలివైనవాడని అంటే, నాకు ఆ కార్డ్‌బోర్డ్ పెట్టె గుర్తొస్తుంది."

"నేను సంక్లిష్టమైన అణువులను అర్థం చేసుకున్నాను. కానీ నా తండ్రి చూపుడు వేలిని అర్థం చేసుకోలేకపోయాను."

ఎవ్వరూ మాట్లాడలేదు.

చివరకు సారా నెమ్మదిగా అడిగింది.

"ప్రొఫెసర్, మీకు ఇంకో ఆదివారం దొరికితే ఏం చేస్తారు?"

ఆయన వెంటనే సమాధానం చెప్పలేదు. కిటికీ బయట తెల్లని మంచును చూశారు.

తర్వాత చాలా ప్రశాంతంగా అన్నారు.

"నా ల్యాప్‌టాప్ ఇంట్లో వదిలి వచ్చేవాడిని."

కొద్దిసేపటి తర్వాత రామ్ అడిగాడు.

"సర్, మా వయసు వాళ్లు ఈ రోజు మీ దగ్గర నుంచి ఒక విషయం మాత్రమే తీసుకెళ్లాలంటే అది ఏమిటి?"

ఆయన చిరునవ్వు నవ్వారు.

"మీరు ప్రేమించే మనిషి, 'నీకు ఐదు నిమిషాలు సమయం ఉందా?' అని అడిగితే, 'రేపు మాట్లాడదాం' అని చెప్పకండి. ***ఎందుకంటే జీవితం మన అనుమతి తీసుకోకుండా క్యాలెండర్ మార్చేస్తుంది.***"

ఆయనకు గౌరవంతో, బరువైన హృదయాలతో వీడ్కోలు చెప్పి మేమంతా బయటకు వచ్చాము.

మేము బయటకు వచ్చేసరికి కొలంబియా యూనివర్సిటీ పూర్తిగా మంచుతో కప్పుకుంది.

విద్యార్థులు మౌనంగా నడుస్తున్నారు.

"సార్, ఇప్పుడు నాకు 'పాత్ టు నోబెల్' అంటే అర్థమైంది." కొద్దిసేపటి తర్వాత మేధ అడిగింది.

"ఏమిటి?" అన్నాను.

"నోబెల్ బహుమతి గెలిచే దారి కాదు. నోబెల్ బహుమతి గెలిచినా మనిషిగా మిగిలి ఉండే దారి కావాలి."

నేను ఆమె వైపు చూసి నవ్వాను.

★★★★★★★★

ఆ రాత్రి ఇంటికి తిరిగి వచ్చి నా ఫోన్ తీసుకున్నాను.

చాలా రోజులుగా మాట్లాడని ఒక మావయ్యకి ఫోన్ చేశాను.

అవతల స్వరం వినిపించింది.

"ఏమైంది? ఏదైనా పని ఉందా? చాలా రోజుల తర్వాత ఫోన్ చేశావు."

"లేదు. మీ గొంతు వినాలని అనిపించింది."

అవతల కొద్దిసేపు నిశ్శబ్దం.

తర్వాత ఒక చిన్న నవ్వు.

ఆ కాల్‌కు ఏ అవార్డూ రాలేదు. ఏ చప్పట్లూ లేవు.

కొన్ని బహుమతులు పతకాల రూపంలో రావు — ఒక పిలుపు రూపంలో, ఒక వినడం రూపంలో వస్తాయి.

"నువ్వు ఫోన్ చేసినందుకు చాలా సంతోషంగా ఉంది."

ఆ మాటే ఆ రోజు నాకు దొరికిన అతిపెద్ద బహుమతి.

COMMENTS